
సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



వ్యవసాయం పండగ
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేయడంతో వ్యవసాయం పండగలా మారింది. దీనిపై కథనం.. 8లో



వైఎస్సార్ సీపీలోకి చేరికలు
ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. 8లో



సాంకేతికతతో కొత్త ఆవిష్కరణలు
నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ అండ్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో గత రెండు రోజులు నిర్వహిస్తున్న టెక్‌జైట్-24 ఆదివారం ముగిసింది. 8లో

న్యూస్‌రీల్

రాజ్యాంగం ద్వారా సమన్యాయానికి అంబేడ్కర్ కృషి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశం చౌక్) : సమాజంలో కుల వివక్షత, ఆర్థిక అసమానతలు సమూలంగా రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని ఆనాడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలియజేప్పారని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్, జేసీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ సమాజంలో మార్పు, సమానత్వం తీసుకురావడం కోసం, బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కు కల్పించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, కలెక్టరేట్ ఏఓ పి.పాపారావు, జేడీఏ జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.


అంబేడ్కర్ సేవలు స్ఫూర్తిదాయకం



నిట్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: రాజ్యాంగాన్ని రచించడం ద్వారా అంబేడ్కర్ సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ నిట్‌లో ఆదివారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో మహోన్నతుడు అంబేడ్కర్ అని నివాళులర్పించారు. రాజ్యాగ నిర్మాతగానే కాకుండా సామాజిక, సామరస్యానికి కృషి చేసిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ వినోత్‌కుమార్‌రాజా, వి.సందీప్, తపస్, రాముడు, భరణి ధరన్, శ్రీనివాసన్, రేష్మా, శ్రీలత, సుదర్శన్ దీప తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన రాజ్యాంగం అందించారు



అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చుకున్న మహామేధావి అంబేడ్కర్ అని ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్ అన్నారు. ఆదివారం ఉద్యానవర్సిటీలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద వీసీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఠినమైన పరిస్థితుల మధ్య ఉన్నత విద్యనభ్యసించిన గొప్పవ్యక్తి అంబేడ్కర్ అన్నారు. వర్సిటీ అధికారులు బి.శ్రీనివాసులు, నారం నాయుడు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధంకు సర్వ సన్నద్ధం

- నేడు ఏలూరు జిల్లాలోకి సీఎం జగన్ బస్సుయాత్ర
- 16న భీమవరంలో భారీ బహిరంగ సభ
- చురుగ్గా ఏర్పాట్లు



నారాయణపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

సాక్షి ప్రతినిధి, ఏలూరు : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు విచ్చేస్తున్న అభిమాన నేతకు దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం కృష్ణా జిల్లా నాగవరప్పాడులో బహిరంగ సభ అనంతరం హనుమాన్ జంక్షన్ క్రాస్ రోడ్డు, ఏలూరు క్రాస్ రోడ్డు, దెందులూరు క్రాస్ రోడ్డు మీదుగా యాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తుంది. భీమడోలు, కైకరం మీదుగా రాత్రి 8 గంటల సమయానికి నారాయణపురం చేరుకుంటుంది. అక్కడ ఏర్పాటుచేసిన క్యాంపు వద్ద రాత్రికి సీఎం జగన్ బస చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బస్సు యాత్రలో భాగంగా జిల్లాలోని దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల మీదుగా సీఎం జగన్ రోడ్‌షోలో పాల్గొంటారు.

16న భీమవరంలో సభ

భీమవరంలో మంగళవారం మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొంటారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. భీమవరం బైపాస్ రోడ్డులోని మెంటేవారితోట ప్రాంతంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బహిరంగ సభ అనంతరం సీఎం జగన్ రోడ్డుషో ద్వారా తూర్పుగోదావరి జిల్లాకు పయనమవుతారు.

ఏర్పాట్ల పరిశీలన

ఉంగుటూరు : సీఎం జగన్ బస్సు యాత్రలో భాగంగా సోమవారం రాత్రి నారాయణపురంలో బస చేయనున్నారు. ఈనేపథ్యంలో బస ఏర్పాట్లను ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం పరిశీలించారు. బస్సు యాత్రను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వాసుబాబు పిలుపునిచ్చారు.

పటిష్ట బందోబస్తు

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నారాయణపురంలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. నారాయణపురంలో ముఖ్యమంత్రి బస చేసే ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, ఎటువంటి ఆటంకాలు లేకుండా యాత్ర సాగేలా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, సీఐ సుభాష్ తదితరులు ఉన్నారు.

భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

బస్సు యాత్రలో సీఎం జగన్‌పై దాడిపై పశ్చిమలో వెల్లువెత్తిన నిరసనలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో చేసిన దాడి ఘటనపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. జిల్లాలో పలు చోట్ల దాడిని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ వస్తుండటంతో తట్టుకోలేక ఈ దుశ్చర్యకు ఒడిగట్టారని మండిపడ్డారు.
– సాక్షి, నెట్‌వర్క్



తాడేపల్లిగూడెంలో నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కారుమూరి



ఆకివీడులో దాడిని ఖండిస్తున్న ఎంపీ అభ్యర్థిని ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

తాడేపల్లిగూడెం: జనహృదయ నేతగా సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో ఉన్న సీఎం వైఎస్ జగన్‌పై దాడికి పాల్పడిన వారికి పుట్టగతులుండవని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సీఎంపై దాడిని నిరసిస్తూ తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్ సీపీని ప్రజాస్వామ్యంగా ఎదుర్కోలేక ఇటువంటి దాడులకు తెగబడుతున్నారన్నారు. సీఎం చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర, రోడ్‌షోలకు, బహిరంగ సభలకు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న అభిమానం, ఆదరణ, స్పందనను చూసి ప్రతిపక్ష పార్టీలు తట్టుకోలేక పోతున్నాయన్నారు. కూటమిగా ఏర్పడినా ఫలితం లేదని చంద్రబాబు దొంగ దెబ్బలకు పాల్పడుతున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి కుట్రలు చంద్రబాబు పన్నాడని కొట్టు ఆరోపించారు. దాడికి నిరసనగా నల్లరిబ్బన్లతో మౌన ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ముదునూరు సొసైటీ చైర్మన్ బూరాడ శ్రీనివాసు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి చంద్రబాబు పనే : మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జరిగిన దాడి ముమ్మాటికీ చంద్రబాబు పనేనని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. విజయవాడ బస్సు యాత్రలో సీఎంపై జరిగిన దాడిపై తణుకు నరేంద్ర సెంటర్‌లో శనివారం రాత్రి మంత్రి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఎంపై దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు. సీఎం జగన్ బస్సుయాత్ర, సిద్ధం సభలకు ప్రజల నుంచి వస్తున్న విపరీతమైన స్పందన చూసి చంద్రబాబు ఓర్వలేక ఈ తరహా దాడులకు తెరతీశాడని విమర్శించారు. కోట్లాది మంది హృదయాల్లో నిలిచిన వంగవీటి మోహన రంగాను రాజకీయంగా అడ్డు వస్తున్నాడనే ఉద్దేశంతో చంద్రబాబు అత్యంత కిరాతకంగా అంతమొందించాడని, నేడు అదే కోవలో ప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఘటనపై విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని మంత్రి కారుమూరి డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వీరమల్లు ఫణీంద్రకుమార్, పిల్లి సూరిబాబు, తాటిపర్తి వాసు పాల్గొన్నారు.

కుట్రలో భాగమే ఇది.. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిని ఉమాబాల, ఉండి అభ్యర్థి పీవీఎల్

ఆకివీడు : కూటమి కుట్రలో భాగమే సీఎం జగన్‌పై హత్యాయత్నమని నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు తీవ్రంగా ఖండించారు. సీఎంపై దాడి ఘటనను ఖండిస్తూ నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి నివాసం వద్ద ఆదివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో జగన్ ప్రభంజనాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తమైతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ.మస్తాన్ వలీ, పట్టణ వైసీపీ అధ్యక్షులు అంబటి రమేష్, వైస్‌చైర్మన్ పుప్పాల పండు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడి – పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి



పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ సిద్ధం సభలకు, అలాగే బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రత్యక్ష దాడులకు పాల్పడుతున్నారని పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి విమర్శించారు. పాలకొల్లులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌పై దాడి వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందన్నారు. ఎన్నికల్లో కూటమికి ఓటమి తప్పదని గ్రహించి ఇటువంటి దుశ్చర్యకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ తదితరులు మాట్లాడారు.


ప్రతి పౌరుడూ ఖండించాలి : – చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌పై దాడి ఘటనను ప్రతి పౌరుడూ ఖండించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఆదివారం మర్రితిప్ప గ్రామంలో నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సిద్ధం సభలకు, బస్సు యాత్రకు వస్తున్న విశేష ఆదరణ చూసి జీర్ణించుకోలేక ఇలాంటి దుశ్చర్యలకు దిగుతున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

హేయమైన చర్య: ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: సీఎం వైఎస్ జగన్‌పై రాళ్ల దాడి అత్యంత హేయమైన చర్య అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. సీఎంపై దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్ ప్రజాభిమానం ఉన్న నాయకుడని, సామాన్యులెవరూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడరని, ఎవరో ప్రేరేపిస్తేనే ఇలాంటి ఘటనలు జరుగుతాయన్నారు. సీఎం జగన్‌కు దేవుడి ఆశీస్సులు, ప్రజల ఆదరాభిమానాలు మెండుగా ఉన్నాయని, ఇలాంటి చర్యల కారణంగా జగన్ జైత్రయాత్రను ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.

సీఎం జగన్‌పై దాడి చీకటిరోజు – అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: సీఎం జగన్‌పై దాడి రాష్ట్రానికి ఒక చీకటిరోజు లాంటిదని అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతో తెలుగుదేశం, జనసేననేతలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇది పక్కా ప్లాన్ ప్రకారం అదును చూసి దాడి చేసినట్టుగా ఉందన్నారు. రక్తం చిందుతున్నా కూడా సీఎం వైఎస్ జగన్ ముఖం మీద చిరునవ్వు చెదరలేదన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు, భగవంతుడి దీవెనలు ఆయనకు మెండుగా ఉన్నాయన్నారు.

పిరికిపంద చర్య – ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్



సాక్షి, భీమవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన కూటమే కారణమన్నారు. సీఎం జగన్‌కు లభిస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక ఈ పిరికిపంద చర్యకు పాల్పడ్డారని ఎమ్మెల్సీ శ్రీనివాస్ విమర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో జగన్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సోషల్ మీడియాలో కథనాలపై దృష్టి

భీమవరం (ప్రకాశం చౌక్): సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కథనాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), లా అండ్ ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక, నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారాన్ని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంగా పరిగణిస్తారని తెలిపారు. ద్వేషపూరిత ప్రసంగం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు మొదలైన సందేశాలు సోషల్ మీడియాలో ప్రసారం అయితే అలాంటి వాటిని చట్టవ్యతిరేకమైన సందేశాలుగా గుర్తించి సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ విక్రమ్‌కు మహానంది పురస్కారం



హైదరాబాద్‌లో పురస్కారం అందుకుంటున్న డాక్టర్ విక్రమ్

తణుకు: తెలుగు వెలుగు సాహితీ వేదిక, విరాట్ విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ప్రతి ఏటా అందజేసే మహానంది జాతీయ పురస్కారాన్ని తణుకు పట్టణానికి చెందిన డాక్టర్ ఆత్మూరి వెంకట విక్రమ్ అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపకులు పోలోజు రాజ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఐటీడీఏ చేరుకున్న ఈవీఎంలు

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎమ్ బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్ ఆదివారం చేరుకున్నట్లు ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ చెప్పారు. పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం బ్యాలెట్ యూనిట్స్ (340), కంట్రోల్ యూనిట్స్ (340), వీవీ ప్యాడ్స్ (360) ఆమోదం పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్లు సూర్యతేజ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



మెట్ట ఉప్పరగూడెంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



కంతేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి కారుమూరి

భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా భీమవరంలోని గునుపూడి, అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ దేశానికి, దళితులకు చేసిన సేవలను కొనియాడారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో సీఎం జగన్

తాడేపల్లిగూడెం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ సీఎం వైఎస్ జగన్ తన పాలనలో సమన్యాయం, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మెట్ట ఉప్పరగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని భారత్‌కు అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. అటువంటి మహనీయుని 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ విజయవాడలో స్మృతివనం పేరిట ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడారు.

భారతదేశ దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్

ఇరగవరం: భారతదేశ దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కంతేరులో అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కారుమూరి మాట్లాడుతూ అణగారిన, బడుగు, బలహీన, బహుజన వర్గాల అభివృద్ధికి అలుపెరగని పోరాటం చేసి ప్రపంచ మేధావిగా పేరు గాంచిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. పెన్మెత్స సుబ్బరాజు, వెలగల సాయిబాబా రెడ్డి, మల్లిరెడ్డి నాగార్జున పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన జగన్

- రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు
- ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, వైఎస్సార్ యంత్ర సేవ వంటివి అమలు
- ఐదేళ్లలో జిల్లాలో 11 లక్షల మంది రైతులకు రూ.1,076 కోట్ల లబ్ధి
- 409 ఆర్‌బీకేలకు ఒక్కొక్క భవనానికి రూ.21.25 లక్షల మంజూరు


వైఎస్సార్ యంత్ర పథకంలో పవర్ టిల్లర్స్ అందజేస్తున్న దృశ్యం (ఫైల్)


డ్రోన్ సహాయంతో వరిపైరుపై పురుగులమందు పిచికారీ (ఫైల్)

భీమవరం: వ్యవసాయాన్ని పండగ చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. జిల్లాలోని 20 మండలాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, రైతు భరోసా, వైఎస్సార్ యంత్ర సేవ వంటి పథకాలతో ఐదేళ్లలో సుమారు 11 లక్షల మంది రైతులకు దాదాపు రూ.1,076 కోట్లు లబ్ధి పొందారు. సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడమేగాక పంట విక్రయం సమయంలో మద్దతు ధర లభించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో రైతులు ఆనందంగా సాగుచేస్తున్నారు. వ్యవసాయం దండగన్న గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా వర్షాలు కురవక సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అష్టకష్టాలుపడి పండించిన పంటకు మద్దతు ధరలేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యంగా రైతులు భావించారు. అటువంటి తరుణంలో 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలకు చెక్ పెట్టారు. సాగు ప్రారంభంలోనే ఏడాదికి రూ.13,500 చొప్పున రైతు భరోసా అందజేశారు. రైతు భరోసా పథకంలో దాదాపు 7 లక్షల మంది రైతులకు రూ.742 కోట్లు, సున్నా వడ్డీ పథకంలో జిల్లాలో 81,209 మంది రైతులకు సుమారు రూ.11.22 కోట్లు అందజేశారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీగా 1,41,234 మంది రైతులకు రూ.104 కోట్లు, పంటల బీమా పథకంలో 1.14 లక్షల మంది రైతులకు రూ.217 కోట్లు లబ్ధి పొందారు. దీనితో రైతులకు పెట్టుబడి సమస్యలు తొలగడమేగాక పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకుని దళారుల ప్రమేయం లేకుండా పంట సొమ్ములను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు.

రైతన్నకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు

రాష్ట్రవ్యాప్తంగా విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. దాదాపు ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి వాటికి సొంత భవనాలు మంజూరు చేశారు. జిల్లాలో 409 రైతు భరోసా కేంద్రాలకుగాను ఒకొక్క భవనం నిర్మాణానికి రూ.21.25 లక్షలు మంజూరు చేశారు. దీనితో రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు నిత్యం అందుబాటులో ఉండడమేగాక ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు లభ్యం కావడంతో రైతుల పంట పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అర్హత కలిగిన రైతులకు వరినాట్లు యంత్రాలు, కోత మెషీన్లు, క్రిషి ట్రాక్టర్లు వంటివాటిని సబ్సిడీపై ప్రభుత్వం అందించింది. దీంతో ఎకరాకు 55 బస్తాలకు పైగా దిగుబడి సాధిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

దళారుల ప్రమేయం లేకుండా..



గడిచిన 5 ఏళ్ల కాలంలో వివిధ పథకాల కింద జిల్లాలోని 11 లక్షల మంది రైతులకు రూ.1,076 కోట్లు లబ్ధి చేకూర్చాం. ధాన్యం విక్రయాల్లో దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్ములను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నాం. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

సబ్సిడీపై పవర్ టిల్లర్ తీసుకున్నా



ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో సబ్సిడీపై పవర్ టిల్లర్, రోటోవేటర్స్‌ను 5గురు సభ్యులతో కలిసి తీసుకున్నాం. పవర్‌టిల్లర్ ఖరీదు రూ.1.85 లక్షలు కాగా దానిలో రూ.70 వేలు ప్రభుత్వం సబ్సిడీ, అలాగే రోటోవేర్ ఖరీదు రూ.1.20 లక్షలు కాగా రూ.33 వేలు సబ్సిడీ వచ్చింది. సొంతంగా సాగుచేస్తున్న పొలంతోపాటు ఇతర రైతులకు దుక్కుతున్నాం.

భూపతిరాజు రంగరాజు, రైతు, విస్సాకోడేరు

క్లుప్తంగా

ముద్దప్పగూడెంలో అగ్నిప్రమాదం

40 ఎకరాల్లో పంటలు దగ్ధం


జామాయిల్ తోటలు దగ్ధమవుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు 40 ఎకరాల్లో పంటలు దగ్ధమైనట్లు సర్పంచ్ కుంజా దుర్గమ్మ తెలిపారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా జీడిమామిడి తోట, జామాయిల్ తోట, తాటి చెట్లతోపాటు తోటలకు మంటలు చెలరేగాయని, ఆ సమయంలో గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారని అన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారని చెప్పారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇరపా బాబూరావు, కుంజా వెంకటేష్, ఇరపా నాగమణిలతోపాటు మరికొందరు రైతుల తోటలు సుమారు 40 ఎకరాల వరకూ దగ్ధమైనట్లు ఆమె తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు సంజీవరెడ్డి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కూల్ డ్రింక్ షాపులో పనిచేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల ప్రకారం.. పట్టణంలోని లాకు సెంటర్ దేశాలమ్మ ఆలయం ఎదురుగా ఆచంట టీడీపీ సీనియర్ నాయకుడు టి విశ్వేశ్వరరావుకు పాండురంగా ఐస్ పార్లర్ ఉంది. ఈ షాపులో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు పనిచేస్తున్నారు. వీరంతా ఆ షాపు పైన ఉన్న రూములోనే నివాసం ఉంటున్నారు. వారిలో ఒంగోలు జిల్లా అంకెంపాలెంకు చెందిన సంజీవరెడ్డి (25) ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీసీ పుటేజీల్లో రాత్రి 12.20 వరకూ సెల్ ఫోన్ చూస్తున్నట్లు ఉండగా అర్ధరాత్రి 1 గంట సమయానికి నిద్రించాడు. ఉదయం మిగిలిన యువకులు సంజీవరెడ్డిని ఎంతలేపినా లేవకపోవడంతో షాపు యజమాని విశ్వేశ్వరరావుకు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన విశ్వేశ్వరరావు నిరంజన్ రెడ్డిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై బాదం శ్రీనివాసు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో శ్రీరాట్నాలమ్మ తల్లి

పెదవేగి : కోరిన కోర్కెలు నెరవేర్చేతల్లిగా పేరుగాంచిన పెదవేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన శ్రీరాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.51,570, విరాళాలపై రూ.10,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 32,250, ఫొటోల విక్రయంపై రూ.5,550 మొత్తం రూ.99,970 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

వాహన కదలికలపై ప్రత్యేక నిఘా


ముసునూరు నేలపాటివారికుంట వద్ద వాహనాల తనిఖీలు

ముసునూరు: సార్వత్రిక ఎన్నికలు చేరువైన నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు తరలింపుపై ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలోని బృందం ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, వలసపల్లి కూడలి కేంద్రాల్లో పలు వాహనాలను పరిశీలించి, తనిఖీలు చేశారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక, గ్రామాలను గుర్తించి నిఘా పెంచినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



భీమవరంలో గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో 15, 26 వార్డుల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని 15, 18, 26 వార్డుల్లో టీడీపీ, జనసేనకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి గ్రంధి శ్రీనివాస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని 15వ వార్డు నుంచి గాడి రవి, విద్యాసాగర్, కోలా వెంకటరమణ, మామిడి ప్రసాద్, ఆర్ ఉదయభాస్కర్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అలాగే 18వ వార్డు నుంచి ఉమా మహేష్, భాను మహేష్, జీవన్, ఆనంద్, రాకేష్ తదితరులు, 26వ వార్డు నుంచి సుంకర ప్రసాద్, సుంకర రాంబాబు, సుంకర శ్రీరామమూర్తి, సుంకర బాబి, వెంకటేశ్వరరావు తదితరులతో పాటు మరో 50 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నాచు పాపయ్య, శ్రీవల్లి, ముద్దుల కరుణ్ కుమార్, వీరా హరినాథబాబు, నందమూరి సుధాకర్, అప్పన ప్రసాద్, కోలా వెంకటరమణ, గాడి ప్రసాద్, గాడి చిన్న, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ


ఈవీఎంల కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టరేట్‌లో ఈవీఎం గోదాములో నిర్వహిస్తున్న ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ ఆదివారం పరిశీలించారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గత శుక్రవారం నిర్వహించి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పూర్తి చేయడం జరిగింది. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచి స్థానిక ఈవీఎం గోడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బీయూలు 4,184, సీయూలు 4,184, వీవీ ప్యాట్లు 4,534 తరలిస్తున్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన డీజీటీ క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్ట్‌తో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుంది. వీటిని వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ వరకు భద్రపరిచి సీలు వేస్తారు. ఇంతవరకు చింతలపూడి, పోలవరం, నూజివీడు, ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి ఈ ప్రక్రియ పూర్తి అయ్యిందని అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం కమిషనింగ్ (ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ ఫిక్స్) చేయడం జరుగుతుంది. చివరిగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి పోలింగ్ స్టేషన్ల వారీగా తరలిస్తారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టరు బి.లావణ్య వేణి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్ప మణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఈవీఎం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అజయ్‌కుమార్

తణుకు: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని తణుకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. తణుకు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అజయ్‌కుమార్ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. విద్యావాలీ ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ గృహిణులు వంటగదుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్లు పీఎస్ఆర్‌వీ ప్రసాద్, ఎ.అప్పారావు, ఎంవీ వెంకటేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, హెచ్‌సీ దుర్గారావు సిబ్బంది పాల్గొన్నారు.

దారి విషయంలో ఇరువర్గాల ఘర్షణ.. వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం దారి విషయంలో జరిగిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఓ వ్యక్తి మృతికి దారితీసింది. అనంతరం పరస్పరం వారు ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కొమరాడ గ్రామానికి చెందిన గొర్ల సత్యవతి, గొర్ల వెంకటేశ్వరరావు (53)కి పొరుగున గొర్ల చిన సత్యనారాయణ, గొర్ల లక్ష్మి, ఉంటున్నారు. వీరికి దారి విషయంలో గొడవలు జరగడంతో గతంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం గొర్ల చిన సత్యనారాయణ తన ఇంటి ముందు దారి వద్ద గోడ కట్టుకుంటున్నారు. గొర్ల సత్యవతి, వెంకటేశ్వరరావు దారిలో ఎందుకు గోడ కడుతున్నారని అడుగగా అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. దీంతో గొర్ల చిన సత్యనారాయణ, గొర్ల లక్ష్మి, కుమారులు గొర్ల సురేష్, గొర్ల వెంకటేశులు కలసి గునపంతో గొర్ల వెంకటేశ్వరరావు తలపై కొట్టారు. వెంటనే అతడిని భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వరరావు భార్య గొర్ల సత్యవతి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై. జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటర్ దాఖలు

దారిలో గోడ కట్టుకుంటుంటే గొర్ల సత్యవతి, గొర్ల వెంకటేశ్వరరావు, గొర్ల నాగరాజు తమపై దాడి చేశారని గొర్ల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అఖిల భారత మహాసభలు ప్రారంభం

పెదవేగి: ముండూరు క్షేత్రంలో యజ్ఞవల్క్య రాజాశ్రమ 66వ వార్షికోత్సవ అఖిల భారత మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రణవ పతాకావిష్కరణ నాయకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, స్వాములు మహాసభలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు ప్రణవ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వేదాంత మహాసభల్లో పాల్గొన్న గారపాటి చౌదరి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు పీఠాధిపతులు ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామి మాట్లాడుతూ ఆదివారం నుంచి మూడు రోజులపాటు అఖిలభారత మహాసభలను కొనసాగుతాయన్నారు.

సాంకేతికతను అందుకుంటేనే నూతన ఆవిష్కరణలు

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్


నూజివీడు ట్రిపుల్‌ఐటీలో టెక్‌జైట్-24లో విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్

నూజివీడు: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం చంద్రశేఖర్ అన్నారు. ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ అండ్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన టెక్‌జైట్-24 ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విప్లవానికి విద్యార్థులు నాంది పలకాలన్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. సాంకేతిక విద్యను ఇన్ని వేల మందికి దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనల వైపు దృష్టి సారించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. ఇలాంటి సాంకేతిక సంబరాలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందింప చేసుకోవడానికి, సృజనాత్మకతను ప్రదర్శించడానికి దోహదపడతాయన్నారు. టెక్ జైట్ కన్వీనర్ డాక్టర్ బి జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ టెక్ జైట్-24లో 12 వర్క్‌షాపులు నిర్వహించామని, ఐఐటీ మద్రాస్, ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసు వంటి సంస్థలకు చెందిన నిపుణులతో గెస్ట్ లెక్చర్స్, 33 ఈవెంట్స్ నిర్వహించామన్నారు. వీటిల్లో విజేతలకు బహుమతులను సైతం అందజేశామన్నారు.టెక్‌జైట్-24 కోకన్వీనర్ శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా టెక్‌జైట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. డీన్ రత్నాకర్, ఎఫ్ఓ శ్రీనాథ్, డీఎస్‌డబ్ల్యూ బ్రహ్మస్వాములు, దుర్గాభవాని, పీఆర్వో సురేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


నూజివీడులో జరగనున్న పోటీలకు ఎంపికైన బాలికల జట్టు


బాలుర జట్టు

ఏలూరు రూరల్: నూజివీడులో జరగనున్న 9వ అంతర జిల్లాల జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పూర్తి చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో బాలికల జట్టు ఎంపిక చేయగా, తాడేపల్లిగూడెం కడకట్ల మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో బాలుర జట్టు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19వ తేదీ నుంచి 22 వరకూ నూజివీడులో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ కార్యదర్శి కె మురళీకృష్ణ, సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారని వివరించారు.

శుభలేఖలు పంచడానికి వెళ్లి..


సంతోష్‌కుమార్ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: శుభలేఖలు పంచడానికి వెళుతున్న ఓ వ్యక్తి మార్గమధ్యలో మృతి చెందాడు. వివరాల ప్రకారం నరసాపురంలోని శ్రీహరిపేటకు చెందిన మురపాక సంతోష్‌కుమార్ (37) తన అన్న కుమారుడి వివాహ వేడుకకు బంధువులకు శుభలేఖలు పంచేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై ఉదయమే బయలుదేరాడు. నరసాపురం నుంచి జగన్నాధపురం వెళుతుండగా మార్గం మధ్యలో పాలకొల్లు పట్టణ సమీపంలోని పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై హరికృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

తాడేపల్లిగూడెం నుంచి మేమంతా సిద్ధం



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మన రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న భీమవరంలో జగన్ సభ నిర్వహిస్తున్న సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి మన వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం భీమవరం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు తాడేపల్లిగూడెం నుంచి మనమంతా భారీగా తరలివెళ్లాలన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తల, అభిమానులు, నాయకులు తరలివెళ్లేదుకు బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణం వార్డుల వారీగా, గ్రామాల వారీగా భారీగా ప్రజలు తరలివెళ్లేందుకు నాయకులు , కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు. సిద్ధం యాత్రకు వెళ్లేవారికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేమంతా సిద్ధం యాత్రకు వెళ్లే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని మంత్రి కొట్టు సూచించారు.

సీఎంపై దాడిని ఖండిస్తూ నిరసన


అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం ఎన్నికల ప్రచారానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు సీఎంపై రాళ్లదాడికి పూనుకొన్నాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ విమర్శించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష పార్టీల ముష్కరులు చేసిన భౌతికదాడిన ఖండిస్తూ ఆదివారం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో టీడీపీ నేతలు అమిత్‌షాపై కూడా రాళ్లదాడి జరిపారని, ఎన్నికలలో వారు గెలిస్తే ఏమి చేస్తామో చెప్పి ఓట్లు అడగాలేతప్ప, ఇలా దాడులు చేయడం దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాక్షేత్రంలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు కనుసన్నల్లో ఇటువంటి దుర్మార్గపు కుట్రలకు ఉసిగొలుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుకొల్లు వెంకట్రావు, రంభ సూరిబాబు, కంకటాల సతీష్, రాయుడు ధర్మారావు, దిరిశాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిను తీవ్రంగా గాయపర్చాలన్న ఉద్దేశంతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఆర్‌కే హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ మేధావులు ప్రతి ఒక్కరు ఈ దాడిని ఖండించాలని కోరారు.

నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేత వాయిదా

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేతను వాయిదా వేశామని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదతాడేపల్లి 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 15, 16 తేదీలలో విద్యుత్ సరఫరా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలిపేస్తున్నట్లు ప్రకటించామని తెలిపారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ నిర్ణయాన్ని వాయిదా వేశామని వివరించారు.

అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు పట్టణంలో ఆదివారం అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తారు. ముందుగా అగ్నిమాపక సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేసి, అనంతరం కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తాడేపల్లి అర్బన్: బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తణుకు టౌన్: ముద్దాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


తాడేపల్లిగూడెం (టీఓసీ): అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం అర్బన్ : బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకు ని స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. భారతదేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు అందించారన్నారు.

క్యాంపు కార్యాలయం వద్ద

పెంటపాడు: అంబేడ్కర్ జయంతిని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరావు, పెంటపాడు మండల పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, బూరాడ శ్రీనివాస్, కర్రి భాస్కరరావు, తెన్నేటి జగజ్జీవన్, చీకటిమిల్లి మంగరాజు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, నిమ్మల పెదకాపు పాల్గొన్నారు.

దేశ దిశను నిర్దేశించిన అంబేడ్కర్

తణుకు టౌన్/తణుకు అర్బన్: రాజ్యాంగం ద్వారా భారతదేశానికి దిశ, దశ నిర్దేశించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, ముద్దాపురం గ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే తణుకు 3వ నంబరు మునిసిపల్ స్కూలు, మునిసిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ పార్కు ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వాలను రాజ్యాంగం ప్రసాదించారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ అద్దా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, అధ్యక్షుడు ఎస్.గోపాల కృష్ణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు కృష్ణంరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీ సురేష్, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సర్పంచ్ మజ్జి పద్మ, టి.సత్యనారాయణ, సర్పంచ్ వి.కృష్ణవేణి, సున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఏఎంసీ డైరెక్టర్ బి పార్వతి పాల్గొన్నారు. మండపాక, తేతలి గ్రామాల్లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలలో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమార్తె దీపిక ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోడపాటి వీర్రాజు, ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు. తణుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో డీ శ్రీలలిత ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

పెంటపాడులో..

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రావిపాడులో ఏసుబాబు కాలనీలో ఎస్సీనాయకులు డెక్కపాటి వెంకటరమణ, భట్టు భరతాంజనేయుల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు ఆధ్వర్యంలో, దర్శిపర్రులో గుండుమోగుల సాంబయ్య ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు ఆధ్వర్యంలో, పెంటపాడులో బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ సెంటర్‌లో జైభీమ్‌యూత్ ఆధ్వర్యంలో, రామచంద్రపురంలో చల్లాకుమారస్వామి, చల్లా లింగమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): అందరి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు ఆధ్వర్యంలో, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈలి నాని ఆధ్వర్యంలో తాలూకా ఆఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం వెంకట విజయకుమార్, ఆధ్వర్యంలో, ఆదర్శ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సబ్ డివిజన్ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అంబేడ్కర్ జయంతిని మునిసిపల్ వర్కర్స్ కాలనీ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, సీఐటీయూ నాయకులు చింతకాయల బాబూరావు పాల్గొన్నారు. భారతదేశంలో మొదటి డాక్టరేట్ తీసుకున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోనే తలమానికమని ఏపీ అక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

అత్తిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని ఆయన బాటలో నడవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం అత్తిలిలో పలు ప్రాంతాలలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్, చినపేట, పెదపేటలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బితి రాజేష్, బుడితి సుజన్‌కుమార్, కోరుకొల్లు వెంకట్రావు, నూకపెయ్యిరామకృష్ణ, కొమ్మర రామారావు, రాయుడు ధర్మారావు, పొన్నమళ్ల సంపదరావు, రంభ సూరిబాబు పాల్గొన్నారు. బల్లిపాడు గ్రామంలో సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

తణుకు: ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే నిజమైన నివాళి అని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ పార్క్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కామన మునిస్వామి, గుబ్బల గోపి, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం (టీఓసీ): అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని


పెంటపాడు: బిళ్లగుంటలో అంబేడ్కర్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం


అత్తిలి: పెదపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


తణుకు: అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం


తణుకులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

తణుకు అర్బన్: కార్మికుల పిల్లలు కూడా డాక్టర్లు, ఇంజనీర్లను చేయాలనే తపనతోనే సంక్షేమంలో విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక శాతం ప్రాధాన్యతనిచ్చారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో భవన కార్మికుల సంఘ సభ్యులతో ఆదివారం రాత్రి సంఘ భవనంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలబడతానని, మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెయింటర్స్ అసోసియేషన్‌కు భవనాన్ని నిర్మింపచేసి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం తరపున మంత్రి కారుమూరికి తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేయగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అనంతరం మంత్రి కారుమూరిని సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఇంటి వీరన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నరాల వెంకటేశ్వరరావు, సంఘ తణుకు అధ్యక్షుడు కొమ్మన విష్ణు, కోశాధికారి సుంకర ప్రసాద్, పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.బాబూరాజేంద్రప్రసాద్, డాక్టర్ దాట్ల సుందరరామరాజు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు


తణుకులో వైద్యులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: మానవాళిని పుట్టించేది భగవంతుడైతే జీవిత కాలం బతికించేది వైద్యులని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యులతో శనివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు ప్రత్యక్షదైవాలని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. తణుకు ప్రజానీకం వైద్యం కోసం దూరప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఐఎంఏకి ఎటువంటి సహకారం అవసరమైనా చేశానని, మీ ఇంట్లో ఎమ్మెల్యేగా ఉన్నానని రాబోయే ఎన్నికల్లో నాకు సహకరించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లువేసి నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కుడారి ఆనంద్, సీనియర్ వైద్యులు డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, డాక్టర్ వి.సుందరరావు, డాక్టర్ కె.సత్యనారాయణరాజు, రిమ్మలపూడి సూర్యనారాయణరాజు, డాక్టర్ రమేష్ చంద్రాబు, డాక్టర్ జి.సుబ్బారావు, డాక్టర్ గుడ్ల సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత


విద్యార్థులను అభినందిస్తున్న శశి యాజమాన్యం

తణుకు టౌన్: ఇటీవల విడుదల చేసిన ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలను అందజేసినట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఆదివారం తణుకు శశి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో అత్యదిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో అత్యదిక మార్కులు 470 మార్కులకు 466 మార్కులు సాధించిన భూపతిరాజు ఉమా ప్రవల్లిక, మీసాల జయరామ్‌లను, బైపీసీలో 440 మార్కులకు గానూ 436 మార్కులు సాధించిన కొక్కిరాల శ్రావణిలను అభినందించి వారికి ఒక్కొక్కరికీ రూ. 10 వేల నగదు పారితోషికాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుద, కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ నల్లూరి రాఘవేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం


తణుకు టౌన్: పైడిపర్రులో వృద్ధుడికి నమస్కరిస్తున్న మంత్రి కారుమూరి కుమార్తె దీపిక


అత్తిలి: కె.సముద్రపుగట్టు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


తొమ్మిదో వార్డులో పర్యటిస్తున్న మంత్రి కొట్టు కుమార్తె కాంచన

తణుకు టౌన్: జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమార్తె దీపిక గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం దీపిక మండలంలోని మండపాక, తేతలి గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి రాబోయే ఎన్నికలలో తన తండ్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా, గూడూరు ఉమాబాలను ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. తణుకు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా తన తండ్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేసిన సేవలను, అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి మరో సారి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, తేతలి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటనాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, సొసైటీ అధ్యక్షురాలు వై.విజయమూర్తి, తేతలి సొసైటీ అధ్యక్షుడు పి.సతీష్ రాజు, నాయకులు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, వీరవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పైడిపర్రులో..

తణుకు పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పైడిపర్రులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రధాన దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమా బాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నాయకులు కొత్తపల్లి చరణ్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చినిమిల్లి సాంబశివరావు, దుర్గా ప్రసాద్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని వేల్పూరు, దువ్వ, తదితర గ్రామాల్లో ఆయా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు.

అత్తిలిలో..

అత్తిలి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడంతో వైఎస్సార్ సీపీ పాలనపట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. ఆదివారం అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, అత్తిలి సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కముజు శ్రీను, బండి సత్యనారాయణ, మల్లుల రామకృష్ణ, కేతా జగదీశ్వరరావు, పూడిమూడి ప్రసాద్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక 9వ వార్డులో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు రాజేష్, కుమార్తె కాంచన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల ప్రచారంలో జగన్ పాలనను చూసి జగన్‌కే ఓటు వేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. తమ త్రండి కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉంటేనే తాడేపల్లిగూడెంలో రౌడీయిజం, గుండాయిజం నశించాయన్నారు. శాంతిభద్రతలతో ప్రశాంత జీవనం సాగాలన్నా, సంక్షేమం, అభివృద్ధి చెందాలన్నా కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సాధ్యమవుతుందని కాంచన, రాజేష్‌లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఓట్లు వేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహనరెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలపించాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట వైఎస్సార్ సీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బూడి ప్రసాద్, కర్రి భాస్కరరావు, చామన సూర్యచంద్రరావు, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి తదితరులు ఉన్నారు.